# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 31-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 550కి పైగా సంస్థానాలను ఏకం చేసి, 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' లక్ష్యాన్ని సాకారం చేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.
- ఆసియా కూటమి దేశాలు, భారత్ సముద్ర విన్యాసాలు, అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ 2026 భారతదేశంలో నిర్వహిస్తామని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రకటించారు.
- సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దార్శనికత, విలువలతో స్ఫూర్తి పొందిన యువత దేశాన్ని 'వికసిత భారత్' దిశగా నడిపిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు.
- దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, మంచు కురిసే అవకాశం వుందని భారత వాతావరణ విభాగం తెలిపింది.
- భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ రెండో మ్యాచ్‌లో భారత్ పరాజయం పొందింది.

==============================

'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా ఏకమై, అంకితభావంతో కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో సర్దార్ పటేల్ విగ్రహానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుష్పాంజలి ఘటించి, 'ఏక్తా దివస్' ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జాతీయ ఐక్యతా దినోత్సవం వేడుకల్లో ప్రధాని మోదీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత, సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ 550కి పైగా సంస్థానాలను ఏకం చేసి, 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' లక్ష్యాన్ని నిజం చేశారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడు ఐక్యతను జాతీయ బలంగా భావించాలని, సర్దార్ పటేల్ దార్శనికతను గుర్తుంచుకోవాలని సూచించారు. దృఢమైన, అభివృద్ధి చెందిన, ఐక్య భారతదేశం కోసం కలిసి పనిచేయాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. దేశ సమగ్రతను బలహీనపరిచే ఏ ఆలోచన, చర్యలనైనా ప్రతి పౌరుడు తిరస్కరించాలని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...35 సెకన్లు)

==============================

భారత్-ఆసియా కూటమి దేశాల భాగస్వామ్యంలో సముద్ర భద్రత అత్యంత ప్రధానమైనదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈరోజు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్-భారత్ రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సముద్ర మార్గాలను సురక్షితం చేసుకోవడం దేశానికి అత్యంత ప్రాధాన్య అంశమని తెలిపారు. దక్షిణ చైనా సముద్రంలో నౌకాయాన స్వేచ్ఛ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, సముద్ర భద్రత వంటి రంగాల్లో భారత్ సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆసియాన్-ఇండియా సముద్ర విన్యాసాలు, అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ 2026 భారతదేశంలో నిర్వహిస్తామని రక్షణ మంత్రి ప్రకటించారు.

(వాయిస్ బైట్...24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత సైనిక, నావిక, వైమానిక దళాల సంయుక్త విన్యాసం 'త్రిశూల్'.. పాకిస్థాన్ పశ్చిమ సరిహద్దు వెంబడి కొనసాగుతోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవల్ ఆపరేషన్స్ వైస్ అడ్మిరల్ ఏ. ఎన్. ప్రమోద్ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... 'త్రిశూల్' విన్యాశాలు వచ్చే నెల 13 వరకు కొనసాగుతాయని వెల్లడించారు. సముద్ర బలగాలన్నింటి మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, త్రివిధ దళాల మధ్య పరస్పర సహకారాన్ని పెంచడమే 'త్రిశూల్' విన్యాసం ప్రధాన లక్ష్యమని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు కొత్త రాయబారిగా డాక్టర్ దీపక్ మిత్తల్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. రెండు దశాబ్దాలకు పైగా దౌత్య అనుభవం, కీలక అంతర్జాతీయ సేవలను దృష్టిలో ఉంచుకుని ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు. యూఏఈలో భారత రాయబారిగా దీపక్ మిత్తల్ నియామకం.. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దార్శనికత, విలువలతో స్ఫూర్తి పొందిన యువత దేశాన్ని 'వికసిత భారత్' దిశగా నడిపిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఆయన ఈరోజు న్యూఢిల్లీలో విద్యార్థులతో మాట్లాడుతూ నేడు ప్రపంచం భారతదేశాన్ని ఆశ, పురోగతి, స్థిరత్వానికి చిహ్నంగా చూస్తోందని, దీనికి యువ పౌరుల శక్తి, ప్రతిభ, సంకల్పమే కారణమని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వం దేశ రాజకీయ ఐక్యతకు, పరిపాలనా బలానికి పునాదులు వేసిందని ఓం బిర్లా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్య సమాజ్ భారతీయత గురించి నిర్భయంగా మాట్లాడే జాతీయవాదుల సంస్థ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్య సమాజ్ కు తగిన గౌరవం దక్కలేదని పేర్కొన్నారు. స్వామి దయానంద సరస్వతి గొప్ప దార్శనికుడని, భారతదేశం నిజంగా పురోగమించాలంటే కేవలం వలస పాలన నుండి విముక్తి పొందడమే కాకుండా, సమాజాన్ని పీడిస్తున్న సామాజిక అన్యాయాల నుండి కూడా విముక్తి పొందాలని ఆయన కాంక్షించారని ప్రధాని తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేటి కాలంలో ఉగ్రవాదం, ప్రాక్సీ యుద్ధాలు, తప్పుడు సమాచార ప్రచారాలు దేశ భద్రతకు ప్రధాన ముప్పుగా పరిణమించాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో 'జాతీయ భద్రత కోసం యువతను శక్తివంతం చేయడం' అనే అంశంపై జరిగిన యంగ్ లీడర్స్ ఫోరంలో ఆయన ప్రసంగించారు. యుద్ధం అనేది భౌతిక దాడి, ప్రత్యక్ష సంబంధం లేని పద్ధతుల్లోకి మారుతోందని ఆయన తెలిపారు. ప్రపంచంతో అనుసంధానమై, సామాజిక అవగాహన కలిగిన యువత, ఈ నూతన యుద్ధ రంగంలో కేంద్ర బిందువుగా నిలుస్తుందని జనరల్ ద్వివేది పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్‌సెత్‌తో సమావేశమయ్యారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ నెల 27న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా రాజ్‌నాథ్ సింగ్, పీట్ హెగ్‌సెత్ సమావేశం జరిగింది. అంతకుముందు, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ... భారత్ తొందరపడి ఏ ఒప్పందాలనూ అంగీకరించబోదని, తమ వాణిజ్య ఎంపికలను పరిమితం చేసే షరతులను ఆమోదించబోదని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో భాగంగా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ లో ఈరోజు జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ జట్టు పరాజయం పొందింది. ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు.. 18.4 ఓవర్లలో 125 పరుగులకే ఆలౌట్ అయింది. 126 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఆస్ట్రేలియా... 13.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు నష్టాలతో ముగిశాయి. నష్టాలతో ప్రారంభమైనప్పటికీ, ఒక దశలో మార్కెట్లు స్వల్పంగా లాభాల్లోకి వచ్చాయి. అయితే, ఆ తర్వాత లాభాలను నిలబెట్టుకోలేకపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 466 పాయింట్లు నష్టపోయి 83,939 వద్ద ముగిసింది. నిఫ్టీ 156 పాయింట్లు కోల్పోయి 25,722 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.77 గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, మంచు కురిసే అవకాశం వుందని భారత వాతావరణ విభాగం తెలిపింది. సిక్కింలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే 24 గంటల పాటు భారీ నుంచి అతి భారీ హిమపాతం సంభవించే అవకాశం ఉన్నందున రెడ్ అలర్ట్' ను ప్రకటించింది. అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, అస్సోం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, సిక్కింలో రేపటి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అండమాన్ నికోబార్ దీవులు, బిహార్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఈశాన్యంలోని కొన్ని ప్రాంతాలలో రేపటి వరకు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =